క్లుప్తంగా

వైభవంగా పూజలు



ధ్వజారోహణ పూజలు చేస్తున్న వేద పండితులు

కడ్తాల్: మండల పరిధి రావిచేడ్ గ్రామం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ భూదేవి సమేత శ్రీనివాస స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం పండిత ప్రకర్ష శ్రీమాన్ తిరుమల వింజమూరి రామానుజ చార్యులు, ఆదిత్యాచార్యులు, చిదంబరం శర్మల మంత్రోచ్చారణల మధ్య నిత్యారాధన, గరుడవాహన సేవ, ధ్వజారోహణ తదితర పూజా కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విఠలయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ గోపాల్, సింగిల్ విండో డైరెక్టర్ డాక్టర్ శ్రీను, నాయకులు రంగయ్య, బాలకృష్ణ, రవికుమార్, సాయి, లింగం, రమేశ్ ఆలయ అనువంశిక ధర్మకర్తలు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్



చెక్కు అందజేస్తున్న నాయకులు

మాడ్గుల: ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరమని వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పల్లె జంగయ్య గౌడ్ అన్నారు. మండల పరిధి అన్నబోయిన్ పల్లి గ్రామనికి చెందిన కొప్పు శ్రీశైలంకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ రూ.32 వేల చెక్కును, సోమవారం బాధిత కుటుంబీకులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్య చికిత్స చేయించుకోలేని పేదలకు సీఎంఆర్ఎఫ్ ఆసరాగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్య, మహేశ్, మల్లేశ్ పాల్గొన్నారు.

ఉత్తర ద్వారానికి పూజలు



పూజలు చేస్తున్న వేద పండితులు

కడ్తాల్: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉత్తర ద్వారానికి సోమవారం వేద పండితులు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. పూర్వ ద్వారం శిథిలావస్థకు చేరడంతో.. నూతన ద్వారం అనివార్యం అయింది. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ చైర్మన్ ఆంజనేయులు, నాయకులు రాఘవేందర్, బ్రహ్మచారి, సాయిరెడ్డి, యాదయ్య, భాను, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి



పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ముదిరాజులు

ఇబ్రహీంపట్నం: తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం ముదిరాజ్ సంఘం కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె ఆశయ సాధనకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భిక్షపతి, సతీష్ చంద్ర, యాద కృష్ణ, నగేశ్, నర్సింహ్మ, మహేందర్, భాస్కర్, రమేష్, నవీన్ పాల్గొన్నారు.

ప్రజావాణిలో 8 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీఓ అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం: ప్రజావాణిలో 5 దరఖాస్తులు అందాయని ఆర్డీఓ అనంతరెడ్డి తెలిపారు. సోమవారం ఇబ్రహీంపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి కార్యక్రమంలో భూములకు సంబంధించిన అంశాలపై ఐదు ఫిర్యాదులు వచ్చినట్లు వెల్లడించారు. ఆ దరఖాస్తులను ఆయా శాఖలకు పంపి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

కుక్కల బెడద.. నిత్యం వ్యథ

- పట్టణంలో శునకాల స్వైర విహారం
- చిన్నారులు, పెద్దలపై దాడులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



5వ వార్డులో సంచరిస్తున్న వీధి కుక్కలు

కొత్తూరు: వీధి కుక్కల సంఖ్య గణనీయంగా పెరిగింది. వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్నాయి. ఎవరు కంటపడినా.. దాడికి పాల్పడుతూ.. గాయపరుస్తున్నాయి. బాట సారులతో పాటు.. సరదాగా ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారులు, పాఠశాలల నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థులు ఇలా ఎవరు కంట పడినా గుర్రుమంటూ ఓరగా చూస్తున్నాయి. వెంబడిస్తూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. హడలిస్తే.. దాడికి పాల్పడుతున్నాయి. దీంతో పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శునకాల బెడద నుంచి కాపాడాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశామని, అయినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

వెంబడించి.. దాడిచేసి..

మున్సిపాలిటీలోని 8, 9, 10వ వార్డుల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఇప్పటికే చిన్నారులతో పాటు పెద్దలను కుక్కలు కరిచిన దాఖలాలు ఉన్నాయి. వాటి నియంత్రణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వాటి సంఖ్య విపరీతంగా పెరిగింది. రాత్రి వేళల్లో ఆయా కాలనీ ప్రజలను వెంబడించి మరీ దాడి చేస్తున్నాయి. గతేడాది కొత్తూరు మున్సిపాలిటీతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సుమారు 112 కుక్కకాటు కేసులు నమోదయ్యాయి.

నియంత్రణ చర్యలు పట్టని అధికారులు

గతంలో హైదారాబాద్‌తో పాటు ఆయా ప్రాంతాల్లో వీధి కుక్కల దాడుల్లో పలువురు చిన్నారులు మృత్యువాతపడ్డారు. దీంతో హైకోర్టు ఆగ్రహించడంతో అధికారులు శునకాల నియంత్రణకు కుని ఆపరేషన్లు చేసేందుకు చర్యలు చేపట్టారు. కానీ.. కొత్తూరులో మాత్రం శునకాల సంఖ్యను లెక్కించడంతోనే అధికారులు సరిపెట్టారు. అప్పట్లో మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో సుమారు 500 కుక్కలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తర్వాత వాటి నియంత్రణ చర్యలు మాత్రం ఇప్పటికీ చేపట్టలేదు. దీంతో పట్టణంలో కుక్కల సంఖ్య చాలావరకు పెరిగిపోయి ప్రజలపై దాడులు చేస్తు గాయపరుస్తున్నాయి.

సమస్యను పరిష్కరించాలి

మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో గౌడ సంఘం కాలనీలో నివాసం ఉంటున్నాం. ఆరు నెలల క్రితం మా బాబు దినేశ్(7)తోటి పిల్లలతో కలిసి ఇంటి సమీపంలో ఆడుకుంటున్న తరుణంలో వీధి కుక్కలు దాడి చేసి కరిచాయి. వెంటనే కొత్తూరు పీహెచ్‌సీకి వెళ్లి చికిత్స చేయించాం. కాలనీలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– ఆనంద్, 5వ వార్డు, కొత్తూరు

నివారణకు కృషి చేస్తున్నాం



మున్సిపాలిటీ పరిధి 5,6,9,10వ వార్డుల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉన్నట్లు గుర్తించాం. ఇప్పటికే మున్సిపల్ పాలకవర్గంతో చర్చించి కుక్కల బెడదను తగ్గించడానికి ప్రణాళిక తయారు చేశాం. స్వచ్ఛంద సంస్థ సహకారంతో కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి బెడదను తగ్గించడానికి కృషి చేస్తున్నాం.

–బాలాజీ, మున్సిపల్ కమిషనర్

భక్తిభావంతో మానసిక ప్రశాంతత

ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి



హోమం చేస్తున్న వేద పండితులు

కడ్తాల్: ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. మండల పరిధి అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని శ్రీరామ వీరాంజనేయ క్షేత్రంలో ఆలయ నిర్వాహకులు కోర్పోలు లీలా లక్ష్మారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో.. శ్రీ సీతారామ, శ్రీ పరమేశ్వర, శ్రీచక్ర సహిత జ్ఞాన సరస్వతి దేవీల ప్రథమ వార్షికోత్సవం కొనసాగుతోంది. ఇందులో భాగంగా సోమవారం వేద పండితులు వెంకటేశ్వర శర్మ పండిత బృదం ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, హోమం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఉపనిషత్తు పారాయణం తదితర కార్యక్రమాలను నిర్వహించగా.. వంశీ తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తి భజనలు, గీతాలాపనలతో పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, పారిశ్రామిక వేత్త కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్, విఠలయ్యగౌడ్, నాయకులు బీక్యానాయక్, కేశవులు, పర్వతాలు, యాదయ్య, రామకృష్ణ, సత్యం, రాజుగౌడ్, జగన్‌గౌడ్, శ్రీరాములు, వెంకట్‌రెడ్డి ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



చక్రతీర్థం కార్యక్రమంలో భక్తులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వేంకటగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఐదు రోజులుగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు ఆలయ ధర్మకర్త గూడ కృష్ణమాచార్యులు, రాధాకృష్ణశర్మ, ఆనంద్‌శర్మల ఆధ్వర్యంలో సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం చక్రతీర్థం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిపించారు.

బోర్ మోటార్ ప్రారంభం



మోటార్‌ను ప్రారంభిస్తున్న లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి

ఆమనగల్లు: తలకొండపల్లి మండల పరిధి సడక్‌తండా గిరిజనుల నీటి సమస్యకు ఆమనగల్లు లయన్స్‌క్లబ్ పరిష్కారం చూపింది. తండాలో నీటి ఎద్దడి నేపథ్యంలో సమస్య తీరుస్తామని క్లబ్ సభ్యుడు దోమ మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు తండాలో సోమవారం బోరుబావిని బాగుచేయించి, నూతన బోరుమోటార్‌ను క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సభ్యులు అందజేశారు. అనంతరం మోటార్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో లయన్ సభ్యులు కండె ఓంకారం, మధుసూదన్‌రెడ్డి, పాండురెడ్డి, పాషా, తండా నాయకులు దేవ్లానాయక్, దేశ్యనాయక్ పాల్గొన్నారు.

వర్గీకరణ జరిగేదాకా.. ఫలితాలు ఆపండి



నిరాహార దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆమనగల్లు: ఎస్సీ వర్గీకరణ చట్టం అమలు అయ్యే వరకు ఉద్యోగ పరీక్ష ఫలితాలను ఆపాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. గ్రూప్ 1,2,3తో పాటు.. అన్ని రకాల ఫలితాలను నిలిపివేయాలన్నారు. సమితి ఆధ్వర్యంలో సోమవారం తలకొండపల్లి మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షలను జెడ్పీటీసీ నర్సింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీలను మోసం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రఘురాములు, మాజీ సింగిల్‌విండో డైరెక్టర్ యాదయ్య, మల్లయ్య, పాండుయాదవ్, మీసాల మహేశ్, సమితి మండల అధ్యక్షుడు శ్రీనుమాదిగ, జిల్లా నాయకులు శ్రీకాంత్, నాయకులు రాంచంద్రయ్య, కుమార్, యాదయ్య, సుధాకర్, నారాయణ, రాజు, సంజీవ, మార్కండేయ, గణేశ్, మహేశ్, గోపాల్, శ్రీశైలం, వంశీ, రవితేజ, రాజు తదితరులు పాల్గొన్నారు.

నల్లా బిల్లులను మాఫీ చేయాలని వినతి



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

మీర్‌పేట: కార్పొరేషన్‌లో అధిక ఇంటి పన్నులను తగ్గించడంతో పాటు వీకర్ సెక్షన్‌లలో నీటి బిల్లులను మాఫీ చేయాలని బీజేపీ మీర్‌పేట నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణి, మీర్‌పేట కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మీర్‌పేట1,2 అధ్యక్షులు భిక్షపతిచారి, ముఖేశ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. పక్కనే ఉన్న బడంగ్‌పేట, జీహెచ్ఎంసీలో కంటే పేద, మధ్యతరగతి ప్రజలు నివసించే మీర్‌పేట ప్రాంతంలోనే ఎక్కువగా ఇంటి పన్నులు వసూలు చేయడం సరైందికాదన్నారు. వీకర్‌సెక్షన్ కాలనీలను గుర్తించి నీటిబిల్లులను మాఫీ చేయాలని, గతంలో కౌన్సిల్ సమావేశంలో అధికారులను ఆదేశించామని, బిల్లుల మాఫీకి సత్వరమే చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు. నీటి బిల్లుల మాఫీ, పన్నులు తగ్గించేంత వరకు బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు సోమేశ్వర్, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, కాసోజు అర్పిత, లతాశ్రీ, కీసర హరినాథ్‌రెడ్డి, జిల్లెల ప్రభాకర్‌రెడ్డి, గౌరీశంకర్ కిషోర్, సూల ప్రభాకర్, గడ్డం జగన్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ



స్టేషనరీ అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు

ఇబ్రహీంపట్నం: పది పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్ స్టేషనరీ పంపిణీ చేశారు. సావిత్రిబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం ఖానాపూర్‌లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, జామెంట్రి బాక్సులు, పెన్నులు అందజేశారు.

నాణ్యతలేని నిర్మాణాలతో ప్రజాధనం వృథా



పగుళ్లు వచ్చిన డ్రైనేజీని పరిశీలిస్తున్న మల్లారెడ్డి, కాలనీవాసులు

బడంగ్‌పేట్: నాణ్యతా ప్రమాణాలు లేకుండా డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టి ప్రజాధనం వృథా చేస్తున్న గుత్తేదారులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, 26వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు నవారు మల్లారెడ్డి అధికారులను కోరారు. సోమవారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధి, అల్మాస్‌గూడలోని 26వ డివిజన్ హనుమాన్ నగర్ కాలనీలోని రోడ్ నంబర్–1లో డ్రైనేజీ పనులను కాలనీవాసులతో కలిసి నవారు మల్లారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు నెలల క్రితం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేశారని, సదరు గుత్తేదారు నాసిరకం పనులు చేపట్టడంతో పగుళ్లు వచ్చాయని ఆరోపించారు. పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఈఈ దృష్టికి తీసుకొచ్చి, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు చేస్తున్న గుత్తేదారుల ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. డ్రైనేజీలు, సీసీరోడ్లు, బీటీరోడ్ల ఇతర అభివృద్ధి పనుల విషయంలో కమిషనర్ దృష్టి సారించాలని, నాణ్యత ఉంటేనే బిల్స్ ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కృష్ణ, వెంకటేశ్‌గౌడ్, తిరుపతిరావు, కరణాకర్ రెడ్డి, మహ్మద్ వలీ, శశిధర్, శ్రీకాంత్, కృష్ణారెడ్డి, శేఖర్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడికి సన్మానం

మాడ్గుల: కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడుగా నియమితులైన సుద్దపల్లి మాజీ సర్పంచ్ గ్యార నర్సింహను సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సత్కరించారు. నగరంలోని ఆయన నివాసంలో నర్సింహ మర్యాదపూర్వకంగా కలవగా.. సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కేశవులు, యాదయ్యగౌడ్, సురేందర్‌రెడ్డి, జగన్ గౌడ్, వెంకటరమణారెడ్డి, శ్రీనివాసులు, శేఖర్ గౌడ్, సాయిలు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో మెరుగైన వసతులు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఎంఈఓలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. అందుకు కావాల్సిన సౌకర్యాల గురించి పూర్తి నివేదిక ఇవ్వాలని ఎంఈఓలకు సూచించారు. నగరంలోని ఆయన నివాసంలో సోమవారం ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల విద్యాధికారులు పాండు, సర్దార్ నాయక్, చంప్లానాయక్, సత్యనారాయణ, మిషన్ భగీరథ డీఈఈ మోహన్‌రెడ్డి, ఏఈ శరత్‌లతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అనంతరం నియోజకవర్గ పరిధి వివిధ మండలాలకు చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.

గురుకులాల ఏర్పాటు చరిత్రాత్మక నిర్ణయం

- పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్
- ఎమ్మెల్యే కసిరెడ్డికి సన్మానం

కడ్తాల్: రాష్ట్ర వ్యాప్తంగా 55 యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలల ఏర్పాటు, వాటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.11 వేల కోట్లను కేటాయించడం చరిత్రాత్మక నిర్ణయమని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఒక్కో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూలుకు రూ.200 కోట్లు కేటాయిస్తూ.. కల్వకుర్తి నియోజకవర్గాన్ని మొదటి దశలో ఎంపిక చేసి, పాఠశాల నిర్మాణానికి నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. సోమవారం స్థానిక నాయకులతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసి సన్మానించారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రలో నిలిచిపోనుందని పేర్కొన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని వెల్లడించారు. మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, నాయకులు కేశవులు, కొండల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రమణారెడ్డి ఉన్నారు.

మొండిగౌరెల్లిని యూడీఏలో కలపండి



డీఆర్ఓ సంగీతకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

యాచారం: ఫ్యూచర్‌సిటీ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో మొండిగౌరెల్లి గ్రామాన్ని కలపాలని ఆ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీతకు వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. మొండిగౌరెల్లి గ్రామాన్ని వదిలి ఎనిమిది కిలో మీటర్ల దూరంలో ఉన్న చింతపట్ల, నల్లవెల్లి, మాల్‌లను యూడీఏలోకి తీసుకుంటున్నారని పేర్కొన్నారు. మొండిగౌరెల్లిని కూడా కలిపి, అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, మేకల యాదగిరిరెడ్డి, మర్రిపల్లి అంజయ్య యాదవ్, వల్లంల బుచ్చిరెడ్డి, తాండ్ర రవీందర్, నక్క శ్రీనివాస్ యాదవ్, మాధం జంగయ్య, సందీప్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆమె' అన్ని రంగాల్లో రాణించాలి

ఎంపీడీఓ కుసుమ మాధురి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మాధురి

ఆమనగల్లు: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఎంపీడీఓ కుసుమ మాధురి అన్నారు. పట్టణంలోని రైతు వేదికలో సోమవారం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీఓతో పాటు.. ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిరేఖ, ప్రజ్వల సంస్థ ప్రాజెక్టు మేనేజర్ బలరామ కృష్ణలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమనగల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ప్రతిభ కనబర్చిన అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, సుజాత, ఆయాలు మంగమ్మ, సరస్వతిలను సన్మానించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. మహిళలు ఉన్నత చదువులు చదువుకోవాలని, ప్రభుత్వం అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు పట్టణంలో కస్తూర్బా గాంధీ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజీవ్ చౌరస్తా వద్ద మానవహారం నిర్వహించారు. మహిళా సాధికారతకు అండగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి పద్మజ్యోతి, ప్రజ్వల సంస్థ సిబ్బంది సురేశ్‌కుమార్, అంబర్‌సింగ్, ఉమ, మితాలిరాజ్, రోజ తదితరులు పాల్గొన్నారు.

ఆరెకటిక సభను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సుభాష్

ఆమనగల్లు: నగరంలోని రవీంద్రభారతిలో ఈ నెల 11న నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆరెకటిక మహాసభను జయప్రదం చేయాలని సూర్యవంశ ఆరెకటిక సంఘం మండల అధ్యక్షుడు సుభాష్ కోరారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంఘం చైర్మన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించే సభకు ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. సభకు పెద్ద ఎత్తున ఆరెకటికలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజశేఖర్, నర్సోజి, రమేశ్, నగేశ్, బబ్లు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందించాలి



కమిషనర్ రవీంద్రసాగర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

ఇబ్రహీంపట్నం: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సామెల్ డిమాండ్ చేశారు. అలాగే మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ మేరకు సోమవారం కమిషనర్ రవీంద్రసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, గృహలక్ష్మి తదితర పథకాలు అర్హులైన పేదలకు దక్కాలన్నారు. మున్సిపాలిటీ 8వ వార్డులో సీసీరోడ్లు, వీధిలైట్లు, నీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. 4వ వార్డు శ్మశానవాటిక వద్ద స్నానాల గదులు నిర్మించాలని కోరారు. బోయవాడ, బీజేఆర్ నగర్, అంబేద్కర్ నగర్, బృందావన్ కాలనీ, త్రిశక్తి కాలనీలలో నీటి సమస్య ఉందని, ఆయా చోట్ల బోర్లు వేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎల్లేశ్, వీరేశం, శంకర్, ముసలయ్య, పురుషోత్తం, యాదగిరి, హనుమంతు, శివ, సుశీల, కాలనీ వాసులు లలిల, శశికళ, పద్మలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

యాచారం: మండల పరిధి గునుగల్ గ్రామంలో సోమవారం సీసీరోడ్లు, అండర్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మంజూరు చేసిన రూ.30 లక్షల నిధులతో మాజీ వైస్ ఎంపీపీ కె.శ్రీనివాస్‌రెడ్డి అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యాదయ్య, రాకేష్ కుమార్, పాండు, శిరీష, రఘురెడ్డి, కన్నారెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.